సాక్షి
బాపట్ల
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023




ఉర్దూ పాఠశాల తనిఖీ

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం శనివారం తనిఖీ చేశారు.



క్యాన్సర్‌పై అవగాహన

పెదకూరపాడు: 75 త్యాళ్లూరు, పెదకూరపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు క్యాన్సర్, కౌమర దశలో వచ్చే వ్యాధులపై విజ్ఞాన్ యూనివర్సిటీ కో–ఆర్డినేటర్లు అవగాహన కల్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2,720 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మహాత్ముడి విగ్రహ ఏర్పాటుకు రూ.14 లక్షల విరాళం



గుంటూరువెస్ట్: కలెక్టరేట్‌లోని లుంబిని వనంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహ ఏర్పాటుకు బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ నిర్వహకులు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డికి రూ.14 లక్షల చెక్కును అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఈ చెక్కు అందజేశారు. బొమ్మిడాల శ్రీమన్నారాయణ, బీవీఎస్‌కె రత్నం, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

బండారు వ్యాఖ్యలు క్షమించరానివి

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత




నాదెండ్ల: సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై టీడీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత చెప్పారు. పల్నాడు జిల్లా చిరుమామిళ్ల గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష వైద్య క్యాంపును శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి రోజాపై టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మహిళలపై లెక్కలేనని నేరాలు జరిగాయన్నారు. సాక్షాత్తూ మహిళా తహసీల్దార్‌నే వేధించి హింసించిన ఉదంతాన్ని ప్రజలు మరువలేదన్నారు. స్త్రీలను ఉద్దేశించి బండారు మాట్లాడిన పదజాలం మహిళాలోకం అసహ్యించుకునేలా ఉన్నాయన్నారు. బండారు వ్యాఖ్యలు క్షమించరానివని, అతన్ని కఠినంగా శిక్షించాలన్నారు.

పెదకాకాని దర్గా ఆదాయం రూ.22.54 లక్షలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీ ద్వారా ఆదాయం గణనీయంగా పెరిగిందని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా చెప్పారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు శనివారం హుండీ తెరిచి కానుకలు లెక్కించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డిప్యూటీ సెక్రటరీ, టీం ఇన్‌చార్జి షేక్ నూర్‌సాహెబ్ పర్యవేక్షణలో ఎటువంటి అవకతవకలు జరగకుండా వీడియో నిఘా, పోలీసు బందోబస్తుతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్గాలోని మొత్తం ఆరు హుండీల ద్వారా బాజీబాబా వారికి రూ.22,54,600 ఆదాయం లభించింది. ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ లెక్కింపు కొనసాగింది. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్ సయ్యద్ రౌఫ్, రెవెన్యూ, పోలీసు, దర్గా సిబ్బంది, కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 525.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 4,459, ఎడమ కాలువకు 2,021 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.20 అడుగుల వద్ద ఉంది.

ప్రకృతి సేద్యం.. రైతుకు వరం



తయారైన వర్మీ కంపోస్టు



వర్మీవాష్ (ల్విక్విడ్) యూనిట్

- 18 ఏళ్లగా వర్మీకంపోస్టు, వర్మీ వాష్ (వర్మీ లిక్విడ్) తయారీ
- పంచాయతీలకు, రైతులకు వానపాములు అందజేత
- ఇక్రిశాట్ సహకారంతో వర్మీ లిక్విడ్ తయారీ
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు శవనం చంద్రారెడ్డి

వేటపాలెం: వ్యవసాయంలో రోజురోజుకూ మార్పులు చేసుకుంటున్నాయి. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చేలా ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మక్కువ చూపుతున్నారు. సహజసిద్ధంగా లభించే ఆకులతో కషాయాలు, వర్మీ కంపోస్టు వంటి ఎరువులు ఉపయోగిస్తున్నారు. తద్వారా భూసారాన్ని పరిరక్షించుకుటున్నారు. ఇటువంటి రైతులకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ప్రోత్సాహన్ని అందిస్తోంది. రైతులకు రాయితీపై వర్మీ కంపోస్టు యూనిట్‌లు నెలకొల్పేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వేటపాలెం మండలం అక్కాయిపాలేనికి చెందిన రైతు శవనం చంద్రారెడ్డి ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయన 2005లో వ్యవసాయ శాఖ ద్వారా జీవనధార సంస్థ సహకరంతో రాయితీపై వర్మీ కంపోస్టు యూనిట్ నెలకొల్పారు. దీనికి అనుబంధంగా నర్సరీని ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి వర్మీ కంపోస్టు క్రమం తప్పకుండా తయారుచేసి తన నర్సరీకి సరిపడా ఉపయోగించుకుంటూ పలువురు రైతులకు అతి తక్కువ ధరకే అందిస్తున్నాడు. వ్యవసాయ శాఖ అధికారుల చేత ప్రశంసలు అందుకుంటున్నాడు.

కొత్త యూనిట్లు నెలకొల్పే వారికి సహకారం..

ప్రకాశం, బాపట్ల జిల్లాలో కొత్తగా వర్మీ కంపోస్టు యూనిట్‌లు నెలకొల్పే వారికి యూనిట్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ వారికి కావాల్సిన మేరకు వానపాములు అందజేస్తుంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 గ్రామ పంచాయతీలకు పంచాయతీల ఆధ్వరంలో ఇటీవల నెలకొల్పిన చెత్త నుంచి సంపద కేంద్రాలకు కూడా వానపాములు అందజేశాడు.

యూనిట్ విజయానికి మెళకువలు..

- యూనిట్ నెలకొల్పే రైతులు వర్మీ యూనిట్ పైకప్పుపై తాటాకులు పందిరి వేసుకోవడం మేలు.
- రేకుల షెడ్డు వేయడం వల్ల వేసవిలో ఎండల తీవ్రతకు వానపాములు మృతి చెందే అవకాశం ఉంటుంది.
- వర్మీ యూనిట్‌కి ప్రతిరోజూ సరిపడిన వరకే నీరు పెట్టుకోవాల్సి ఉంటుంది.



వర్మీ వాష్ లిక్విడ్

వర్మీవాష్ (ద్రవం) తయారీ విధానం..

ఒక ప్లాస్టిట్ డ్రమ్ తీసుకొని అడుగు భాగం మొదటి వరసలో ఇటుక ముక్కలు వేసుకోవాలి. రెండో వరసలో 40 ఎంఎం సైజు గుళకరాళ్ల వేయాలి. మూడో వరసలో 20 ఎంఎం గుళకరాళ్ల వేయాలి. నాలుగో వరుసలో బేబీ చిప్స్ మెటల్ వేయాలి. ఐదో వరుసలో ఇసుక వేసుకోవాల్సి ఉంటుంది. దాని పైన గోనె సంచి పరచాలి. దాని పైభాగంలో పేడ, ఆకులు ఎరువు వేసుకోవాలి. దానిలో వానపాములు వదలాలి. డ్రమ్ పైభాగంలో ఒక చిన్న పాటి కుండను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. డ్రమ్ కింది భాగంలో కుళాయి ట్యాప్ ఏర్పాటు చేసుకోవాలి. డ్రమ్ పైభాగంలో ఉంచిన మట్టి కుండకు చిన్నపాటి రంధ్రం పెట్టి దానికి గుడ్డ ముక్క తొడగాలి. మట్టి కుండలో రోజు నీరు నింపాల్సి ఉంటుంది. ఆ నీరు కింద భాగంలో ఏర్పాటుచేసిన రంధ్రం గుండా డ్రమ్ పైభాగంలోని ఎరువుపై చుక్క చుక్కగా పడుతుంటుంది. అందులో ఉన్న వానపాములు చెత్తని తిని దాని ద్వారా వదిలిన వ్యర్థాల లిక్విడ్ డ్రమ్‌కి కింది భాగంలో ఏర్పాటు చేసిన కుళాయి ద్వారా కిందికి వస్తుంది. దీన్ని బకెట్‌లో పట్టుకొని నిల్వ చేస్తారు. ఈ విధానం ద్వారా వచ్చిన వర్మీ లిక్విడ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పద్ధతి ద్వారా 45 రోజులకు లిక్విడ్ రూపంలో బయటకి వస్తుంది.

వర్మీ వాష్ (లిక్విడ్) ఉపయోగాలు..

- ఒక లీటర్ వర్మీ వాష్‌కి 2 లేదా 3 లీటర్లు నీరు కలిపి మొక్కలకు పోయడం ద్వారా మొక్కలకు పోషక విలువతో కూడిన ఎరువుగా ఉపయోగపడుతుంది.
- ఒక లీటరు వర్మీ వాష్ (లిక్విడ్)లో ఒక లీటరు ఆవు మూత్రం, 8 లీటర్ల నీరు కలుపుకొని పంట చేలపై పిచికారీ చేసుకోవడం ద్వారా పంటకు పట్టిన పురుగులు, చీడపీడలు పూర్తిగా నిర్మూలించుకోవచ్చు. పురుగుమందుగా ఉపయోగించుకోవచ్చు.

18 ఏళ్లగా వర్మీకంపోస్టు తయారు చేస్తున్నా..



నర్సరీలో 18 ఏళ్లుగా వర్మీ కంపోస్టు, వర్మీవాష్ (వర్మీ లిక్విడ్) తయారు చేస్తున్నాను. నా నర్సరీలోని మొక్కలకు సరిపడిన వరకు ఉంచుకొని మిగిలినది రైతులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నాను. గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద కేంద్రాలకు, కొత్తగా యూనిట్‌లు నెలకొల్పే రైతులకు వానపాములు అందిస్తుంటాను. ప్రతి నెలా రెండు టన్నులు కంపోస్టు తయారు చేస్తుంటాను.

– శవనం చంద్రారెడ్డి, రైతు



జ్యోతి సురేఖ (ఫైల్)

ముచ్చటగా మూడో స్వర్ణం

- 19 ఆసియా క్రీడల్లో అర్చరీ విభాగంలో జ్యోతి సురేఖ సత్తా
- మహిళల కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ గురి తప్పలేదు. చైనా వేదికగా జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో ఒత్తిడిని జయించి ఏకాగ్రతతో ఆడి మూడు స్వర్ణ పతకాలను గెలుచుకుంది. చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న ఈ పోటీల్లో ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగం, కాంపౌండ్ ఉమెన్ టీమ్ విభాగంలో ఇప్పటికే స్వర్ణ పతకాలు సాధించిన జ్యోతి సురేఖ, శనివారం ఉదయం జరిగిన మహిళల కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగం మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలను సాధించిన తెలుగు అమ్మాయిగా జ్యోతి సురేఖ రికార్డు సృష్టించింది.

10న విజయవాడ రాక

ఆసియా క్రీడల్లో పతకాలు పొందిన క్రీడాకారులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల పదో తేదీన ఢిల్లీలో అభినందించనున్నారు. జ్యోతి సురేఖ ఆ కార్యక్రమంలో పాల్గొని, ముగిసిన తర్వాత విజయవాడ నగరానికి వస్తుందని ఆమె తండ్రి సురేంద్రకుమార్ తెలిపారు. జ్యోతి సురేఖ ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు సాధించడంతో చాలా సంతోషంగా ఉందన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

- 4 నెలల కిందట చోరీలకు శ్రీకారం
- అరిగిన, మారు తాళాలతో దొంగతనాలు
- సుమారు రూ.20 లక్షల విలువ చేసే 24 మోటారు సైకిళ్లు స్వాధీనం

నగరంపాలెం: అరిగిన/మారు తాళాలతో మోటారుసైకిళ్లను దొంగలించే అంతర్ జిల్లా దొంగను గుంటూరు సీసీఎస్, కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు సీసీఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇటీవల గుంటూరులో వరుసగా జరుగుతున్న మోటారు సైకిళ్ల చోరీలపై బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు తూర్పు ఏఎస్పీ నాచికేత్ షెల్కే నేతృత్వంలో సీసీఎస్, కొత్తపేట పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, చోరుల ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు. ముందస్తు సమాచారంతో శనివారం కొత్తపేట మాయాబజార్‌లో మకాం వేశారు. ఈ క్రమంలో గౌరీశంకర్ థియేటర్ సమీపాన మోటారు సైకిల్‌పై ఉన్న ఓ యువకుడు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. కొత్తపేట పీఎస్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి, సిబ్బంది కలిసికట్టుగా అతని పట్టుకున్నారు. పోలీసులకు చిక్కిన వ్యక్తి పాత గుంటూరు బాలాజీనగర్ ఐదో వీధికి చెందిన ఆవుల రాఘవయ్యగా గుర్తించారు. పోలీసుల విచారణలో నేరం రుజువుకావడంతో అతన్ని అరెస్ట్ చేసి, సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ (క్రైం)శ్రీనివాసరావు, పక్కన సీఐలు శ్రీనివాసరావు, అన్వర్‌బాషా

తాపీ పని వదిలి...చోరీల వైపు..

రాఘవయ్య బీకాం ఉత్తీర్ణత కాలేదు. దీంతో అతను తాపీ పనులకు వెళ్లేవాడు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశ ఉండేది. చోరీలకు పాల్పడితే, త్వరగా డబ్బులు సంపాదించవచ్చనే దురుద్దేశంతో మోటారుసైకిళ్లపై కన్నేశాడు. సరిగ్గా నాలుగు నెలల కిందట మొదటిసారి పాతగుంటూరులో ఒక మోటారుసైకిల్‌ను దొంగలించాడు. ఇక అప్పటి నుంచి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్, జీజీహెచ్, నగరంపాలెం, తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు నిలుపుదల చేసిన ద్విచక్ర వాహనాలను అరిగిన/మారు తాళాలతో అపహరించి ఉడాయించేవాడు. అలా తెనాలిలో ఒకటి, గుంటూరు నగర పరిసరాల్లో 23 మోటారు సైకిళ్లను దొంగిలించాడు. ద్విచక్రవాహనాలను పాతగుంటూరు బాలాజీనగర్ చివర్లోని పొలాల్లో చెట్ల వద్ద భద్రపరిచేవాడు. ఈ క్రమంలోనే శనివారం ఒక మోటారు సైకిల్‌ను విక్రయించేందుకు మాయాబజార్‌కు వచ్చి పోలీసులకు చిక్కాడు. వరుస చోరీలను త్వరితగతిన ఛేదించిన తూర్పు ఏఎస్పీ నాచికేత్ షెల్కే, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీ (క్రైం) కె.ప్రకాష్‌బాబు, సీఐలు డి.వెంకన్నచౌదరి, జెల్లం శ్రీనివాసరావు (సీసీఎస్) షేక్.అన్వర్‌బాషా (కొత్తపేట పీఎస్), ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి (కొత్తపేట పీఎస్), ఏఎస్‌ఐలు ఎం.అంటోని, వి.ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎండీ.జానీ, షేక్.ఖాసీం, ఎస్.రమేష్, కానిస్టేబుళ్లు బి.ఉమామహేశ్వరరావు, ఎస్.రవి, కోటేశ్వరరావు, హోంగార్డు వై.విజయ్‌లను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అభినందించారు. అనంతరం పలువురికి నగదు రివార్డులను ఏఎస్పీ అందించారు.



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

పేదల పెన్నిధి శంకరన్

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల : పేదల పెన్నిధిగా గొప్ప పేరుగాంచిన కలెక్టర్ శంకరన్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్.ఆర్.శంకరన్ విగ్రహాన్ని మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కలసి శనివారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శంకరన్ ఆశయాలకు అనుగుణంగా అధికారులంతా పనిచేయాలని సూచించారు. పేదలందరికీ సహాయం చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలన్నారు. పేదలకు విస్తృత సేవలు అందించిన శంకరన్ విగ్రహాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం నిస్వార్థ సేవలు అందించిన శంకరన్ నేటి సమాజానికి ఆదర్శప్రాయుడు అన్నారు. నిరుపేదల సౌభాగ్యం కోరుతూ ఆయన చేసిన కృషి ఐఏఎస్ సర్వీస్‌లకే వన్నె తెచ్చి పెట్టిందన్నారు. సఫాయి కర్మచారుల వృత్తి సమాజం నుంచి తొలగించడానికి ఎంతో కృషి చేశారని వివరించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఎన్నో అవకాశాలు కల్పించారని చెప్పారు. పేదల పక్షపాతి అధికారిగా శంకరన్ చెరగని ముద్ర వేసుకున్నారని, మంచి సేవలతో అందరికీ మార్గదర్శులయ్యారన్నారు. శంకరన్ ఆశయాలను పునికి పుచ్చుకుని కలెక్టర్ రంజిత్ బాషా నిరంతరం పేదల కోసం పనిచేస్తున్నారని కితాబిచ్చారు. అనంతరం కలెక్టర్ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల అధ్యక్షులు డాక్టర్ పి.సి.సాయిబాబా, కలెక్టరేట్ ఏవో గోపీకృష్ణ, న్యాయవాది షేక్ బాషా, చారువాక, నూకతోటి బాబురావు, కోటేశ్వరరావు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు జీవీ బ్రహ్మ పాల్గొన్నారు.



శంకరన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఆడుదాం ఆంధ్రకు క్రీడా సామగ్రి

ఆంధ్రప్రదేశ్ క్రీడాసాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి క్రీడా సామగ్రి రావటం ఎంతో సంతోషకరమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. క్రీడా సామగ్రి నాణ్యతను కలెక్టర్ శనివారం పరిశీలించారు. నవంబరు 15 నుంచి డిసెంబరు 21వరకు జరిగే క్రీడా పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ సీహెచ్ శ్రీధర్, కె.పాల్‌కుమార్ ఉన్నారు.

న్యాయవాదులు నిరంతర విద్యార్థులు


జిల్లా న్యాయమూర్తి సోమశేఖర్

చీరాల రూరల్: కక్షిదారులకు న్యాయ సహాయాన్నందించే న్యాయవాదులు నిరంతర విద్యార్థులని, కోర్టులు ఇస్తున్న జడ్జిమెంట్లను ప్రతి నిత్యం గమనిస్తూ వాటిని చదువుకోవాలని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎంఏ.సోమశేఖర్ అన్నారు. శనివారం ఆయన చీరాల కోర్టును సందర్శించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో పరిశీలన నిమిత్తం విచ్చేసిన ఆయన రికార్డులను, కోర్టు పరిసరాలను పరిశీలించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా న్యాయమూర్తిని న్యాయవాదులు సత్కరించారు. సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ చీరాల కోర్టులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన న్యాయమూర్తి సోమశేఖర్ జిల్లా అదనపు రెండో న్యాయమూర్తి హోదాలో చీరాల కోర్టుకు పరిశీలనకు రావడం ఆనందంగా ఉందన్నారు. చీరాలలో పనిచేసిన కాలంలో సౌమ్యుడిగా పేరొందారని, సీనియర్, జూనియర్ న్యాయవాదులు అనే తారతమ్యాలు లేకుండా అందరితో కలివిడిగా ఉండేవారని చెప్పారు. జూనియర్ న్యాయవాదుల పట్ల ఆయన ఎంతో ప్రేమ కలిగి ఉండేవారని పేర్కొన్నారు. తొలుత జిల్లా న్యాయమూర్తి సోమశేఖర్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. రెహానా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్.నిషాద్‌నాజ్, అసోసియేషన్ జనరల్ సెక్రటరి కటకం చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కే నాగేశ్వరరావు, ఎంవీ.చలపతిరావు, తాడికొండ సాయిబాబు, శ్రీకాంత్ ఠాకూర్, ముద్దన సురేష్ చౌదరి, రావుల రమేష్‌కుమార్, కరవది భాను ప్రకాష్, అందె విశ్వేశ్వరరావు, టి.శకుంతల, శారద, ఏజీపీ వి.హరికృష్ణ, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఆర్.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



జడ్జి సోమశేఖర్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2400, గరిష్ట ధర రూ.3700, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.

క్లుప్తంగా

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ పోతుల సునీత

వేటపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేయడం కోసమే లక్ష్యంగా పనిచేస్తున్నారని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. వేటపాలెం సచివాలయం–3 పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శనివారం సందర్శించారు. అన్ని విభాగాల వైద్యుల వద్దకు వెళ్లి అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగలకు మందులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, తహసీల్దార్ అశోక్‌వర్ధన్, ఈఓఆర్‌డీ రాజ్యలక్ష్మి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి లేళ్ల శ్రీధర్, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, అందే కృష్ణ, జిడుగు మస్తాన్, కర్ణ ప్రసాద్, షేక్ కజ్జీ, ఆవుల అశోక్, సాదు రాగవ, పిట్టు హనుమంతరావు, సజ్జా పవన్, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు ఐటీఐలో మెగా అప్రంటీస్ మేళా

చెరుకుపల్లి: గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం మెగా అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2023 సంవత్సరానికి ముందు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో వివిధ ట్రేడ్‌ల్లో శిక్షణ పూర్తి చేసుకుని పాస్ సర్టిఫికెట్ పొందినవారు హాజరుకావాలన్నారు. ఈ మేళాకు జిల్లాలోని అనేక ప్రముఖ కంపెనీలవారు వారికి కావల్సిన అభ్యర్థులను నెరుగా ఎంపిక చేసుకుంటారని తెలిపారు. వివరాల కోసం 93986 50408లో సంప్రదించాలని కోరారు.

అతివేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: అతివేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బైక్‌పై హెల్మెట్ ధరించాలని, కారులో తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు.

మీ ఇంట్లో అయితే ఇలానే ఉంటారా ?

- తల్లిదండ్రుల ఆరోపణలపై డీసీఓ తనిఖీ
- యద్దనపూడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం



గురుకుల పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న డీసీఓ పద్మజ

యద్దనపూడి: మీ ఇంట్లో కూడా ఇలానే ఉంటారా.. శుభ్రంగా ఉంటేనే కదా ఇళ్లు కూడా బాగుంటుంది అంటూ గురుకుల డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ (డీసీఓ) పద్మజ గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యద్దనపూడి అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శనివారం తనిఖీ చేశారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు చుండి లక్ష్మీనారాయణమ్మ ఉన్నారు. 600 మందికి పైగా బాలికలు చదువుకునే పాఠశాల, ఆవరణ ఇంత అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, విషసర్పాలు, కుక్కలు తిరగటం, మరుగుదొడ్ల నిర్వహణ, ఏ మాత్రం బాగోలేదని తనిఖీ గుర్తించారు. బాలికల బాగోగులు చూసుకోవాల్సిన ప్రిన్సిపాల్ స్థానికంగా ఉండకపోవటం, మరుగదొడ్ల నుంచి వెలుపలకు వచ్చే దుర్వాసనతో కూడిన నీటిలోనే విద్యార్థులు నడవటం, మరగుదొడ్ల సంపులు నిండిపోయి కొద్దిసేపు కూడా ఆ ఆవరణలో ఉండలేకపోవటం, హాస్టల్ మెత్తం అపరిశుభ్రంగా ఉండటం గమనించిన డీసీఓ, ప్రిన్సిపాల్‌పై సీరియస్ అయ్యారు. మీ ఇంట్లో ఇలానే ఉంటారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఆవరణ బాగుచేయటానికి పనివాళ్లు దొరకటం లేదంటూ ప్రిన్సిపాల్ చెప్పటంతో సిబ్బంది తీరును తప్పుబట్టారు. 20 రోజుల్లో పాఠశాల నిర్వహణ తీరు మారకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు.

ప్రజాక్షేమమే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయం

- ప్రజలకు ఉపయోగపడేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు
- జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాపరిషత్ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా

ఫిరంగిపురం: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కత్తెర హెనీక్రిస్టినా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోను అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్నారన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా అనేక పథకాలు ప్రవేశపెట్టి దళారులతో పని లేకుండా నేరుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు పాలనలో ఏ ఒక్క పథకం అమలు చేయలేదని చెప్పారు. అహర్నిశలు ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు అఖండ మెజార్టీతో గెలుపించుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, నాయకులు కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, జి.చంద్రం, పి.జేమ్స్ ఇన్నయ్య, మేడాబాబు, డి.మెల్కియా, డి.సురేష్, వై.రమాదేవి, జోస్ ఫినా, డేవిడ్, టి.కృష్ణ, పాలపాటి రఘు, బి.శ్రీనివాస రెడ్డి, కమలా రెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, నరేంద్ర కుమార్, పి.చిన్న, ఖాజావలి, సుధాకర రెడ్డి, సీహెచ్ రామమోహన్‌రెడ్డి, టి.కృష్ణ, యల్లారెడ్డి, చిన్నప్ప, బాజీ, వి.రాము, చౌదయ్య, పిచ్చిరెడ్డి, కె.రామారావు, ఈశ్వరరెడ్డి, బ్రహ్మారెడ్డి, గాంధీబుడే, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమికి మేలు

జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి మోహన్



ఏల్చూరులో శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

సంతమాగులూరు(అద్దంకి): ప్రకృతి వ్యవసాయంతో భూమికి రైతుకు మేలు జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి జే మోహన్ అన్నారు. మండలంలోని ఏల్చూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం ప్రకృతి వ్యవసాయ శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా సిబ్బందికి పంట కషాయాల తయారీ, వాటిని వాడే విధానం, ఉపయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులందరూ అవలంబించాలన్నారు. పెట్టుబడి తక్కువ చేసుకోవడంతోపాటు, విషతుల్యం కాని ఆహార ఉత్పత్తులను పంటల నుంచి పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంటీ వెంకటేశ్వర్లు, సుబ్బారావు, బాజీ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి

పశు సంవర్ధకశాఖ ఏడీప శంకరరావు



రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ శంకరరావు

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): పశు సంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను పశు పోషకులు వినియోగించుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంకరరావు సూచించారు. నల్లమోతువారిపాలెంలో పశు విజ్ఞాన బడి శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవాలకు పోషక విలువలు ఉన్న దాణా పెట్టాలని చెప్పారు. పశు పోషణలో మెలకువలు పాటించాలని కోరారు. పశువులకు వచ్చే వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఆట్ల బాలశంకర్‌రెడ్డి ఉన్నారు.

తెనాలి డబుల్ హార్స్ ఆధ్వర్యంలో 'ఫిర్ సే ఉడాన్'

ఈనెల 14న ప్రారంభం

తెనాలి: తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్, థింక్‌మేట్స్ సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా 'ఫిర్ సే ఉడాన్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళా సాధికారత కల్పించేందుకు సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కెరీర్‌ను తిరిగి ప్రారంభించే మహిళల కోసం ఫిర్ సే ఉడాన్‌ను ప్రారంభించారు. ఈ ఈవెంట్‌ను ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు టీ–హబ్ (ఫేజ్–2 రాయదుర్గ్)లో ప్రారంభిస్తున్నట్టు తెనాలి డబుల్‌హార్స్ జనరల్ మేనేజర్ పీఎస్‌వీ కృష్ణప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కెరీర్‌ను పునఃప్రారంభించాలనుకునే మహిళలు, సంబంధిత హెచ్‌ఆర్ మేనేజర్లను నేరుగా కలిసేందుకు, ఇంటర్వ్యూల కోసం ప్లాన్ చేయటానికి లేదా ఐటీ ఉద్యోగానికి దరఖాస్తు చేసేందుకు ఆసక్తి ఉన్నట్లయితే థింక్‌మేట్స్ బృందం నుంచి ఉచిత శిక్షణ పొందేందుకు అదొక వేదిక అవుతుందని తెలిపారు. ఫిర్ సే ఉడాన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించామని, ఆసక్తిగలవారు ఈవెంట్‌లో పాల్గొనేందుకు 'ఫిర్ సే ఉడాన్'లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం తెనాలి డబుల్‌హార్స్ వాట్సాప్ 78427 80199 నంబరులో సంప్రదించవచ్చని కృష్ణప్రసాద్ వివరించారు.

జాతీయ స్థాయి పోటీల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

పెదకూరపాడు: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జి 20 ది ఇండియా నేవి ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు శివాంజన్, హేమంత్, మణికంఠ రెండవ రౌండ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించినట్లు ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. పోటీల్లో దేశ వ్యాప్తంగా పన్నెండు వేల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ప్రతిభకనబరిచిన టీంలు అక్టోబర్ 10న నిర్వహించనున్న క్వార్టర్ ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి అభినందించారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

గుంటూరు ఈస్ట్: రాష్ట్రంలో అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోందని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ చెప్పారు. కొత్తపేట దేవదాయ శాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అర్చకుల సమస్యలపై అధికారులతో కలసి కమిషనర్ సత్యనారాయణ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనువంశిక అర్చకుల పరిరక్షణే ధ్యేయంగా వారి పేర్లు నమోదు చేసుకోవడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,539 మంది అర్చకులను గుర్తించామని చెప్పారు. రూ.5 లక్ష ల్లోపు ఆదాయం ఉన్న దేవాలయాల్లో ఫౌండర్ ట్రస్టీ లేక అనువంశిక అర్చకులకు ఆలయ నిర్వహణ అప్పజెప్పడం జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జోన్ పరిధిలో 39 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ధూప దీప నైవేద్యం కింద 4,700 దేవాలయాలకు రూ.5వేలు ఇస్తున్నామన్నారు. కనీస వేతనం 3,205 మందికి ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నవరం, కాణిపాకం తదితర దేవాలయాల తరపున ధర్మ ప్రచార రథాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సింహాచలం, విజయవాడ, శ్రీశైలం తదితర పెద్ద దేవాలయాల్లో ధర్మ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 6ఏ పరిధిలోని దేవాలయాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతు భరోసా కింద అర్చకుల పేర్ల నమోదుకు కలెక్టర్లతో మాట్లాడి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.